# సరదా కథలు

"నో...నో...నో... లాభం లేదు... ఎల్లుండి సాయంత్రకల్లా నాకు మొత్తం పని పూర్తయి పోవాలి. ఇంక మాటలనవసరం... ఊహు... ప్రసక్తి లేదు... కుదర్దు..." అంటూ ఫోన్‌లో అరుస్తున్నాడు కంట్రాక్టర్ గంగాధర్.

అప్పుడే ఆ గదిలో అడుగుపెట్టాడు అతని కొడుకు ప్రహ్లాద్.

తండ్రి అరుస్తున్న అరుపులకి అతని గుండెలు గుభేలుమంటున్నాయి. బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు.

అన్నట్టు అతని వయసు నాలుగేళ్ళు. ఆ రోజు అతడి పుట్టినరోజు కూడా.

"అబ్బెబ్బే... నేనివాళ రావడం ఇంపాసిబుల్. ఎలాగైనా సరే వర్క్ పూర్తయి తీరాలి. అంతే... అంతగా అయితే మరో నలుగుర్ని అర్జంటుగా పనిలోకి అదనంగా తీసుకోండి... ఊ...

## సన్‌స్ట్రోక్

ఓ..కే... ఉంటామ" అంటూ ఫోన్ పెట్టేసి పక్కకి తిరిగాడు గంగాధర్.

చేతిలో అక్షింతల పళ్ళెంతో బిత్తరపోయి చూస్తున్న కొడుకుని చూడగానే మనసు ద్రవించి పోయిందతనికి. "రా... నాన్నా.. ఏంటీ అక్కడే నిలబడిపోయావ్!? దా" అంటూ ఎత్తుకున్నాడు. "ఇవాళ నా హాపీ బర్తడే" అన్నాడు ప్రహ్లాద్ మెల్లిగా.

"గుర్తుంది నాన్నా! అందుకేగా నేనివాళ ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఇవాళంతా నీతోనే ఉంటాను. ఆడుకొంటాను. చెప్పు.. నీకేం ప్రెజెంటేషన్ కావాలో..." అడిగాడు గంగాధర్ అక్షింతలు జల్లుతూ.

"ఏం వద్దు..." అడ్డంగా తలూపేడు ప్రహ్లాద్.ఆశ్చర్యం వేసింది గంగాధర్‌కి. ఏది చూసినా కొనమని ప్రాణాలు తోడేసే తోడేల్లాంటి తన కొడుకు ఏమీ ఒద్దనడానికి బలమైన కారణమే ఉండాలి. బహుశా తన అరుపులకి భయపడ్డాడేమో? ఇకనుంచి పిల్లల ముందు గట్టిగా అరవకూడదు అని దృఢంగా అనుకున్నాడు మనసులో.

"ఫర్వాలేదు నాన్నా.. చెప్పు . నీకేం కావాలో?" అంటూ మళ్ళీ అడిగాడు ఆప్యాయంగా అనునయంగా.

మయూరి వీక్లి

మళ్ళీ అడ్డంగా తలూపేడు ప్రహ్లాద్.

ఇక లాభంలేదని భార్యని పిలిచాడు. బయటికెళ్దాం పదమన్నాడు. క్షణంలో ముగ్గురూ తయారయి కారులో కూర్చున్నారు. జూకి వెళ్ళారు. అక్కడ్నించి అటే ఖరీదైన హాటల్‌కి వెళ్ళి చక్కటి భోజనం చేశారు.

ఆ తర్వాత కారు ఇందిరా పార్కుకి చేరుకొంది. అక్కడ బోట్ షైర్ చేశారు. సాయంత్రం ఆరున్నరయింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

ప్రహ్లాద్ ముఖం ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉంది. కొడుక్కి పుట్టిన రోజు పూటా ఏమీ ఇవ్వలేకపోయానన్న గిల్టికాన్షస్‌తో ఉదయం నుంచీ సతమతమవుతున్న గంగాధర్‌కి ఇదే అదనిపించింది.

"నాన్నా... ఇవాళేం... మరేం... నీపుట్టిన రోజు కదా... మరి నీకు ఏం కావాలో చెప్పవూ..." అని అడిగాడు ఎంతో ముద్దుగా.

"నాకు... నాకు... తమ్ముడు కావాలి" అన్నాడు ప్రహ్లాద్.

హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు గంగాధర్... "ఓశ్... ఇంతేనా?" అన్నాడు.

పక్కకి తిరిగి—"ఏవోయ్ ... విన్నావా... నీ ముద్దుల కొడుకు పుట్టిన రోజు కోరిక! వాడి ముచ్చట తీర్చే ప్రయత్నాలు మనం చేద్దామా?" అన్నాడు భార్యతో చిలిపిగా.

"ఇప్పుడు మీరు కొత్తగా శ్రమేం పడక్కర్లేదు గాని... ఓ ఆరు నెలలు ఆగండి" అందామె ఇంకా గడుసుగా — సగటు తెలుగు సినిమా హీరోయిన్ ఫీలింగులన్నీ గుప్పించేసి.

"ఈజిట్!? అమ్మదొంగా... మరి న్నాళ్ళూ చెప్పలేదేం? అన్నాడు గంగాధర్ పక్కా తెలుగు సినిమా హీరో లెవల్లో ఎక్స్‌ప్రెషన్‌లో కుమ్మేస్తూ.

ఆ తర్వాత మళ్ళీ ఈపక్కకి తిరిగి — "ఒరే నాన్న... ఓ ఆరు నెలలు పోయాక ఇస్తుందిరా తమ్ముణ్ణి— మీ అమ్మ" అన్నాడు కులాసాగా

"ఊహు... నాకివాళే కావాలి"

'ఎలారా? ఆరు నెలలు ఆగాలి... తప్పదూ' అన్నాడు గంగాధర్ మరింత విలాసంగా నగలు పోతూ, 'లేదు నాన్నా...అంతగా అయితే అదనంగా మరో నలుగుర్ని అర్జంటుగా పనిలోకి తీసుకో నాన్నా... ప్లీజ్... నాకు మాత్రం తమ్ముడు ఇవాళే కావాలి" అన్నాడు ప్రహ్లాద్ దృఢంగా.

